
# మాబాబు



**రంజన్**

**ఈ** పేరు చూసి ఇది సినిమా కథని గాని ఇంచుమించు అదే తరహా కథనిగానీ అనుకుంటే మీరు పూర్తిగా పొరబడ్డారన్నమాటే!

ఇదలాంటి కథ కానే కాదు. నూటికి నూరు పాళ్లు స్వతంత్రంగా రాసిన కొత్త బాణీ కథ.

ఇందులోని కథానాయకుడి పేరు 'బాబు' అతను మా అందరికీ చాలా చాలా కావలసిన మిత్రుడు. అంచేత మాబాబు మీద ఈ కథ రాస్తున్నాము. అతను చదివినా ఏమనుకోడనే నమ్మకం చేతనే నా ఈ సాహసం!

అతని పేరు అనిపించినంత చిన్నది కాదు, హాజరు పట్టీలో పూర్తిగా రాయడం చేత నాలుగు వరుసలు నిండిపోయింది. అతని పేరు. మాదిరెడ్డి పిర వెంకట సత్య కుసుమ హరనాధ ...... (ఇంకేవేవో పేర్లుండాలి కొండవీటి చాంతాడుకు ప్రత్యేకంగా ఉపయోగించ దగినంత పొడుగు గొలుసు లింకుల్లా!) ....... చివర్న 'బాబు' కనుక ఎం. వి. వి. ఎస్. కె. హెచ్. . . . . బాబు అని సాధ్యమైనంత పొట్టి చేశారు. మా బాబుక్కూడా ఇదే కాస్త అనుకూలంగా వున్నట్టుంది. ఇది వరకు ఎవరైనా పేరడిగినప్పుడు పూర్తి పేరు చెప్పబోయి మధ్యలో తడుముకునేవాడు, ఇప్పుడా చిక్కు లేదు. అక్కడో అక్షరం ఇక్కడో అక్షరం వదిలేసినా అట్టే ప్రమాదం లేదు.!)

మొత్తం మీద అతని పేరు ఇంగ్లీషు రాస్తే దాదాపు ఆంగ్ల అక్షర మాల అంతా రావడం వల్ల, అంతా కలిసి ఓ శుభోదయాన 'ఆల్ఫాబెట్ బాబు' అని నామకరణం చేశాము. మొన్నామధ్య హాజరు తీసుకునేటప్పుడు మా మేష్టారొకాయన నాలుగు వరుసల్లో వున్న ఇతని పేరును చూడగానే అదిరిపడి — "ఎవరు 'ఎట్సెట్రా — ఎట్సెట్రా బాబు ? నాకు దర్శన భాగ్యం కలగనిస్తారా ?" అని అడిగాడు. వెంటనే బాబు "నేనండీ !" అంటూ లేచి నిలబడ్డాడు. ధీమాగా ! అందరూ గొల్లుమన్నారు. మా మేష్టరు కూడా ఇతని రూపం, కంఠం గట్రా చూసి మురిసి పోయాడు. దానికి అతడి మొహ కవళికలే నిదర్శనం.

# మా బాబు

బాబును మంచి చేసుకోవాలంటే మంచి చిట్కాలున్నాయి. — కావాలంటే చెప్తాను వినండి!

లాటరీ టిక్కెట్లు కొనడమంటే చాలా సరదా బాబుకు. నెలకో అయిదు టిక్కెట్లన్నా కొంటూంటాడు. టిక్కెట్టు తీసుకొని రూముకు రాగానే ఇక తనకు ప్రైజొస్తే ( గిస్తే ) తను చేయవలసిన ఖర్చంతా చెబుతాడు.

" లక్ష రూపాయలు వస్తే, పదివేలు మా పెద్దక్కకి, 10 వేలు మా రెండో అక్కయ్యకు, పది వేలు మా మూడో అక్కకి, పది వేలు మా మొదటి చెల్లెలికి, పది వేలు మా రెండో చెల్లెలికి., పది వేలు మా అమ్మకి, పదివేలు మా నాన్నకి, పది వేలు మా తమ్ముడికీ., " అంటాడు.

' ఇక నీకు మిగిలేదేమిటి చిప్ప ? ! ' అన్నాడు. మురళీ ఒకరోజు.

" మిగలకేం ? ఇరవై వేలు మిగులుతుంది ! "

" నాకే మిస్తా బాబూ మరి ! "

" ఓ వెయ్యి రూపాయలిస్తాలే ! "

" నాకూ ? " అడిగాడు కుమార్.

" నీకూ ఓ వెయ్యి ! "

" నాకూ " అన్నాడు ప్రతాప్.

" ఏడు వందల ఏభై ! "

" నాకూ ! " అన్నా నేను.

" బాబోయ్ ! అందరికీ ఇచ్చేస్తే ఇంక నాకేమిటి ? నీ కివ్వను ! "

" ఇంత పక్షపాత మేమిటి బాబూ. అందరికీ ఇచ్చి నాకు లేకుండానా? నేనొక్కణ్ణేగా మిగిలింది ! ' అన్నా.

" సరే ! . . . . ఓ రిస్టు వాచీ ! "

" గుడ్ ! కాని టిటోనీ కావాలి బెల్ట్‌తో సహా ! "

" బాప్‌రే ! . . . . . . . . సర్లే ! "

మేమంతా అతని అమాయకత్వానికి నవ్వుకున్నాం. నిజంగా చేతికి వచ్చి ఇచ్చే వాడిలాగే అనుభవిస్తున్నాడు. పాపం ! అనుకున్నాం. నిజంగా వస్తే — బాప్‌రే ఇంకేమన్నా వుందీ ! ఒక్క పైసా ముట్టనివ్వడు.

మా మీద ఎప్పుడన్నా అతనికి కోపం వచ్చినప్పుడు — " బాబూ, నువ్ లాటరీ టికెట్ కొన్నావా ఈ నెల ? " అని అడుగుతాం.

" ఈసారన్నా తగులుతుందంటావా ? " అంటాడు.

"ఓ. యస్ ష్యూర్!"

"నీ కెట్లా తెలుసు " అంటూ చుబుకం పట్టుకుని అడుగుతాడు.

" మనసులో అలా అనిపిస్తుంది బాబూ ! "

" థాంక్స్ ! .... నీ కింకో రెండువందలెక్కువిస్తా ఈసారి తగిల్తే ! " అంటాడు.

ఒకనాడు విచిత్రాతి విచిత్రమైన విషయం ఒకటి జరిగింది.

బాబు ఒకనాడు 'దేవదాసు పక్కీ'లో రూముకు వచ్చాడు. రాగానే జుట్టు పీక్కుంటూ మంచం మీద కూలబడి పోయాడు. మేమంతా ఆశ్చర్యపోయాం ! ఏమైనా ఒంట్లో సుస్తీ చేసిందా అనుకున్నాం. వొళ్ళు పట్టుకు చూస్తే మామూలుగానే వుంది.

" ఏమిటి బాబూ ఈ అవతారం ! "

" . . . . . . . . "

" బాబూ ! "

" [illegible] ! . .... హృదయ వేదన ! " తగ్గు స్థాయిలో అన్నాడు.

ఆశ్చర్యపోయాం. అంతటి చిక్కు ఏమిటొచ్చిందా అని. నిజానికది అర్థం కాలేదు మాకు.

" ఏమిటి బాబూ — జరిగిన సంగతేదో చెప్పు !"

కాస్సేపు ఆగి — " మన కాలేజీలో నుంచి వెనకదారి లేదూ ? ..... వుంది కదూ ? .. ఇవాళ ఆ దారిన వద్దామనుకుంటూ బయల్దేరాను. అంతలో ........ " ఆపేశాడు. సిగ్గుపడుతున్న పెళ్ళికొడుకులా వున్నాడాక్షణాన. నమ్మండి, నమ్మకపోండి ! ఆకళ వచ్చేసిందా మొహాన.

" ఏమయింది బాబూ ! " ఉత్కంఠతో అందరూ ప్రశ్నించారు.

" అంతలో ..... ఒక మెరుపు ...... మెరుపు ... మెరుపు ..... మెరుపు..........."

" మెరుపేమిటి ? .... తొందరగా అఘోరించు !'

" ....... కాదు .... మెరుపు లాంటి పిల్ల ! "

అర్థమైంది అందరికీ బాబుకు పట్టిన జబ్బేమిటో. ప్రేమ జ్వరం ! .... అయినా బాబుకు ప్రేమేమిటి ? అనుకుని ఊరుకున్నాం.

కాని మేమనుకున్నంత తేలిగ్గా లేదు వ్యవహారం. రోజూ కాలేజీకి రావడానికి బాబు మనస్సంగీకరించడం

యువకుడు : దయచేసి మీ టెలిఫోన్ నెంబరు కొంచెం యిస్తారూ ! అవసరమైనప్పుడు ఫోన్లో మాట్లాడుకోవచ్చు !

యువతి : డైరెక్టరీలో ఉంది !

యువకుడు : మంచిది ! మరి మీ పేరో ?

యువతి : అదీ అందులోనే ఉంటుంది చూడండి !

—మాధవ్

లేదు. లైబ్రరీకి వెళ్ళి ఏవేవో ప్రేమ పురాణాలు తీసుకొచ్చి ముందు పడేసుకొని కూర్చుంటున్నాడు.

వ్యవహారం ముదర బోతుందని తెలిసి బలవంతాన మేము కాలేజీకి లాక్కెళ్తే, కాలేజీ వెనక దారి గుండా ( ఎంతో ఆశతో ) మళ్ళీ రూముకు వెళ్ళిపోయేవాడు.

మళ్ళీ రెండు మూడుసార్లు కనిపించినట్టు చెప్పాడు.

ఒకరోజు సాయంత్రం నేనూ, బాబూ, మురళీ కలిసి సినిమాకు పోతూండగా దార్లో విశ్వేశ్వర్రావనే ఒక ప్రఖ్యాత రచయిత సైకిలు మీద వెళ్తూ మమ్మల్ని చూసి దిగాడు. మాతో సినిమాకు రమ్మన్నాం. సరేనని మాతోటే సైకిల్ తోసుకుంటూ వస్తున్నాడు.

అంతలో బాబు — " అదుగో — అదుగో — " అని అరిచాడు.

ఏమ్ముంచుకొచ్చిందో అని అటు చూశాం. ఒక అమ్మాయి పోతూ వుంది. కొస్త అర్థమైంది. కాని " ఏమిటి ? " అని అడిగాను.

" ఆ అమ్మాయే ! ఆ అమ్మాయే ! "

" విశ్వేశ్వర్రావు గారూ ! ఒకసారి సైకిలిస్తారా ?" అని అడిగి తీసుకుని ముందు బాబును కూర్చో పెట్టుకుని గబగబా ముందుకు పోనిచ్చాను. మధ్య దార్లో ఒక కానిస్టేబుల్ కనిపించి సైకిలాపమన్నాడు.

" డీయస్పీ గారి మేనల్లుణ్ణి ! అర్జంటు పనుంది ! " అంటూ పోనిచ్చాను. అతను నాకో సెల్యూట్ కూడా పడెయ్యడం గమనించి ఆశ్చర్యపోయాను.

ముందుకు వెళ్ళి దిగాం.

" ఈ అమ్మాయేనా ? ...... కానట్టుంది రంజన్ ! " అన్నాడు తల గోక్కుంటూ బాబు.

నా తల మీద ఠావ్ మని మొట్టినట్టయింది. ఏ పిల్లనో కూడా తెలీకుండా ఇంత ఘాటుగా ప్రేమించాడన్నమాట !

" ఈ అమ్మాయి కాదనుకుంటా ! " నసిగాడు బాబు.

"అది కూడా నిశ్చయంగా చెప్పలేవన్న మాట ! .. ఏం ప్రేమయ్యా నీది ? " —నవ్వూ ఏడుపూ కూడా వచ్చాయి నాకు.

అంతలో మురళీ, విశ్వేశ్వర్రావు కూడా వచ్చారు.

" ఏమయింది ? " అన్నాడు మురళీ.

" ఈ అమ్మాయి కాదులా వుంది ! — అంటున్నాడు మానవుడు ! " అన్నా కోపంగా.

అందరూ కలిసి ఏడిపించడంతో కాస్త సిగ్గుపడి ఈ పాడు ప్రేమ మానుకున్నాడు.

మా కోర్సయిపోయింది.

ఎవరి ఊళ్ళకి వాళ్ళెళ్ళాం.

ఒకనాడు బాబు దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది నాకు. తనకు పెళ్ళి నిశ్చయమైందనీ తప్పకుండా రావాలనీ రాశాడు. కానీ ఇంట్లో ఇబ్బందుల వల్ల నేను వెళ్ళలేకపోయాను. మిగతా అందరూ వెళ్ళారట. మురళీ జాబు రాశాడు— "బాబు ఆనాడు అంత అంత ఘాటుగా ప్రేమించిన అమ్మాయే ఈనాడు పెళ్ళి కూతురు! " అని " ఏం, తను చెప్పాడా ? .. అయితే నమ్మడానికి వీల్లేదు. ఎవర్ని చూసి ఎవరనుకున్నాడో ఏమో ! " అని జవాబు రాశాను.

మా పరీక్షా ఫలితాల కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్న నాకు బాబు దగ్గర్నుంచి ఒక రిజిస్టర్డ్ పార్సెల్ వచ్చింది. ఏమిటా అని ఆశ్చర్యంగా విప్పి చూశాను.

' టిటోని ' రిస్ట్ వాచ్ ! దాని బిల్లు ! !

ఎంతో సంతోషంతో వుత్తరం తీశాను.

డియర్ రంజన్,

నాకు లాటరీలో ఇన్నాళ్ళకు లక్ష రూపాయలు వచ్చాయి. అందరి వాటాలూ పంపేశాను. నీకు టిటోని గనుక దొరకడం ఆలస్యమైంది. క్షమించు!

మా ఆవిడ ఎంతో మంచిది సుమీ! నువ్వు నమ్మితే నమ్ము లేకపోతే లేదు ! ఆనాడు నేను ఈవిడనే అంతగా ప్రేమించింది. అదృష్టవశాత్తు యాదృచ్ఛికంగా ఈ పిల్లనే స్థిరపరిచారు నాకు !

నాకు ఇన్నాళ్ళు పరీక్షలు రాశాననే ధ్యాసేలేదు అసలు మర్చిపోయాననుకో.

ఇక వుంటా — ఉత్తరం రాయి. —

నూజివీడు,
14—8—64.

నీ
' ఆల్ఫాబెట్ ' బాబు.

" నిజంగా మాట తప్పనివాడు మా బాబు!" అనుకున్నాను చివరికి !